క్లుప్తంగా

ఫెంగల్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న ఎంవీ.సుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో ఫెంగల్ తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ.సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ జిల్లాలో ఫెంగల్ తుఫానుకు వరి పంటను నష్టపోయారన్నారు. 75 కిలోల ధాన్యం రూ.2 వేలకు తక్కువ కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం వ్యాపారులు బస్తా రూ.1200 నుంచి రూ.1300 వరకు కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గోదాములు ఏర్పాటు చేయాలన్నారు.

కడప ఉక్కు కోసం పోరాటం


మాట్లాడుతున్న వీరణాల శివకుమార్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప ఉక్కు పరిశ్రమ కోసం పోరాటం చేస్తామని, అధికార. ప్రతిపక్ష నాయకులు కలిసి రావాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమపై కేంద్రం వైఖరి దారుణంగా వుందని, పార్లమెంటులో ఆ ప్రస్తావనే తమ వద్ద లేదని చెప్పడం దారుణమన్నారు. కడప ఉక్కుతో వలసలు, కరవుతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతంలో వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నోరెత్తకపోవడం బాధాకరమన్నారు. నగర కన్వీనర్ విజయ్, నరసింహ, ఇమ్రాన్, వంశీ, శ్రీకాంత్, విజిత్, రాము, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ

కడప కార్పొరేషన్: మాజీ కౌన్సిలర్ మోహిద్దీన్ సాహెబ్‌ను మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా శుక్రవారం పరామర్శించారు. కడప నగరంలోని జగదీశ్వర్‌రెడ్డి న్యూరో కేర్‌లో చికిత్స పొందుతున్న ఆయనను అంజద్‌బాషా పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మోహిద్దీన్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తోట క్రిష్ణ, షఫీ, దాసరి శివప్రసాద్ పాల్గొన్నారు.

బాల వికాస్‌కు పురస్కారం


అవార్డు అందుకుంటున్న గంగయ్య

కడప ఎడ్యుకేషన్: కడప బాలవికాస్ హైస్కూల్‌కు ప్రతిష్టాత్మక ఏడ్యూ లీడర్ అవార్డు దక్కింది. హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగిన 5వ ఇ.టి.టెక్ అవార్డ్స్ కార్యక్రమంలో బాల వికాస్ పాఠశాల డైరెక్టర్ గంగయ్యకు ఈ అవార్డు శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశ వ్యాప్తంగా ప్రకటించిన ఎనిమిది అవార్డులలో తమ పాఠశాల నిలవడం ఎంతో గర్వకారణమని డైరెక్టర్ గంగయ్య తెలిపారు. పాఠశాల ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఫలితాలు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, తదితర వాటి ఆధారంగా ఈ అవార్డు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

దివ్యాంగులు ప్రతిభావంతులు

కడప రూరల్: దివ్యాంగులు ప్రతిభావంతులు అని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి అన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నసుబ్బయ్య అధ్యక్షతన స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాధవీరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, మాతయ్య, సుబ్బారావు, ప్రసాద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

కడప రూరల్: కడప నగరంలో ఏర్పాటుచేసిన బీసీ భవన్‌కు సౌకర్యాలు కల్పించాలని జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు బత్తల లింగమూర్తి తెలిపారు. పెనుగొండలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో బీసీ వర్గాల సౌకర్యార్థం బీసీ భవన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రివిక్రమ్‌రావు, కళ్యా సుధాకర్, రేవిల్ల మునిరత్నం పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు మరువలేనివి

కడప ఎడ్యుకేషన్: అంబేడ్కర్ సేవలు మరువలేనివని ఊటకూరు వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రం, కేవీకేల్లో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. శాస్త్రవేత్తలు వీరయ్య, అంకయ్యకుమార్, సునీల్‌కుమార్, బాగవతిప్రియ పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

చలి.. తన పంజా విసురుతోంది. వేకువ జామునుంచి మంచు దుప్పటి కప్పేస్తోంది. రోజూ క్రమేణా చలి పెరుగుతుండడంతో స్వెటర్లు వేసుకున్నా.. మంకీ క్యాపు పెట్టుకున్నా.. గజగజ వణకాల్సి వస్తోంది.


కడప నగరంలో చలి నుంచి రక్షణగా ఉలన్ దుస్తులు

కడప కల్చరల్: కడప నగరంలో చలి క్రమంగా పెరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు వాతావరణం చల్లబడడంతో చలి మొదలైంది. ఒక దశలో వర్షాలు గడగడ వణికించగా.. ఇటీవలి కాలంలో ఎప్పుడూ లేనంతగా చలి పెరిగి నగర వాసులను వణికిస్తోంది. దాదాపు పది రోజులుగా ఉదయం ఎనిమిది గంటలు దాటితే గానీ ఎండ రావడం లేదు. 9.30 గంటల వరకు చలి గాలులు వీస్తున్నాయి. తెల్లవారుజామున బయటికి రావాల్సి వస్తే స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, ఉలన్ గ్లౌజు ధరించాల్సిందే. ఉదయం 6.00 గంటల్లోగా, సాయంత్రం 7.00 గంటల తర్వాత ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే గజగజ వణుకుతున్నారు. తెల్లవారుజాము, చీకటి పడే వేళల్లో చలి అధికంగా ఉంది. మరో నెలరోజులు తీవ్ర చలి ప్రభావం ఉంటుందని పేర్కొంటుండడంతో ప్రజల అందుకు తగినట్లుగా సిద్ధమవుతున్నారు.

క్రమంగా పెరుగుతూ..

వారం రోజులుగా వాతావరణాన్ని గమనిస్తే ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. మరి కొన్నాళ్లు ఈ పరిస్థితి తప్పకపోవడంతో ఉలన్ దుస్తులు, జర్కిన్లు జనం సిద్ధం చేసుకోక తప్పడం లేదు. మార్కెట్‌లో వ్యాపారులు స్వెటర్లు రూ. 800–1200 వరకు, జర్కిన్లు రూ.700–3000, పిల్లల చలి దుస్తులు రూ. 300–1000, మంకీ క్యాప్‌లు రూ.60–300, కాన్‌పట్టీలు రూ. 30–400 వరకు విక్రయిస్తున్నారు. 12 సంవత్సరాలలోపు పిల్లలకు ఉలన్ ఫుల్ సూట్లు రూ. 500–1000 వరకు విక్రయిస్తున్నారు. నగరంతోపాటు ఇతర పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ ఫుట్ పాత్‌పై వ్యాపారాలు పెరుగుతున్నాయి. జిల్లా అంతగా రూ. కోటికి పైగానే వ్యాపారం జరుగుతుందని వ్యాపారుల అంచనా!

ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్ మృతి బాధాకరం

రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాయచోటి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు సీఎస్ ఎజాస్ అహ్మద్ ఆకస్మిక మృతి బాధాకరమని, ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోందని రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మృతుడు నివాసంలో ఎజాస్ కుటుంబ సభ్యులను రాష్ట్ర రవాణా, క్రీడాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం సాయంత్రం పరామర్శించి తన సానుభూతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆకతాయి చేష్టలు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడి ప్రాణాలు కోల్పోవడానికి కారణమవడం బాధాకరం అన్నారు.వీ సంఘటనలు విద్యార్థి లోకానికే చెడ్డ పేరు తీసుకు వస్తాయన్నారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నారని, మృతికి కారణాలను సమగ్రంగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫోన్ చేసి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి, అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు అభిమానులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

న్యాయం చేయాలని ఎస్టీయూ వినతి

కడప ఎడ్యుకేషన్: అన్నమయ్య జిల్లా కొత్తపల్లిలో పనిచేస్తూ విద్యార్థుల దాడిలో మృతి చెందిన ఎజాస్ అహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్టీయూ నాయకులు మంత్రికి శుక్రవారం విన్నవించారు. కడప నగరంలోని ఓ కార్యక్రమానికి హాజరైన ఆయనను ఎస్టీయూ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టం రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాదిక్ అలి, సంజీవ రాయుడు, జబీబుల్లా ఖాన్, ఫక్రుద్దీన్, ఖాజా మొయినుద్దీన్, ఫయాజ్, జవీద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి హత్య సామాజిక పతనమే

కడప కల్చరల్ : అన్నమయ్య జిల్లా రాయచోటి కొత్తపల్లి జెడ్పీ ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్‌ను విద్యార్థులు హత్య చేయడం సామాజిక పతనావస్థకు సూచిక అని ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ వెంకటయ్య అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థుల దాడిలో హత్యకు గురికావడం పతనానికి చేరిన విలువలకు నిదర్శనమన్నారు. ఈ ఘటనతో ప్రస్తుతం ఉపాధ్యాయులు పాఠాలు చెప్పేందుకు భయపడుతున్నారని, చిన్నపాటి దండన విధించినా ప్రభుత్వం ఉపాధ్యాయులను శిక్షించడం ఇలాంటి సంఘటనలకు ఊతంగా మారుతోందన్నారు. తండ్రి లాంటి గురువు విద్యార్థిని మందలించకపోతే చిన్నారులకు చదువు విలువ తెలియదన్నారు. ప్రస్తుతం శిక్ష గురువుకే పడిందని, ఆయన కుటుంబ సభ్యుల ఆవేదన ఎవరూ తీర్చలేనిదని అభిప్రాయపడ్డారు. పిల్లలను సరైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యతను గుర్తెరగాలని సూచించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ


నూతన వస్త్రదానం చేస్తున్న దాతలు

కడప అర్బన్: హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప నగర శివారులోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో పేదలకు శుక్రవారం నూతన దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. నంద్యాల జిల్లా రుద్రవరం వాస్తవ్యులు యాగల నరసింహులు కుమార్తె లక్ష్మీ ప్రియ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నప్రసాద వితరణ చేశారు. కడప నగరంలోని శంకరాపురానికి చెందిన కాలూరి నారాయణమ్మ వర్ధంతి సందర్భంగా కుమార్తె చల్లా ప్రభావతమ్మ నూతన వస్త్రాలను, బెడ్‌షీట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, దామోదర్, మధు పాల్గొన్నారు.

ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మహా పాదయాత్ర




ఆకేపాటి మహా పాదయాత్రకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడుగడుగునా స్వాగతం పలికారు. ప్రజలకు అభివాదం తెలిపారు. - రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని ఫుట్ పాత్‌లపై ఉంటున్న నిరాశ్రయులకు సమ్మెరిటన్ ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో శుక్రవారం 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. జేబీబీఎస్ ది ప్రిజర్వ్ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ ప్రస్తుతం చలి ఎక్కువగా ఉండడంతో నిరాశ్రయులు ఇబ్బందులు పడుతున్నందున వృద్ధులకు దుప్పట్లు అందజేశామని తెలిపారు. చాలా మంది చలికి వణుకుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భరత్, జుటూరు విజయ్‌కుమార్, విజయ్, కాశి, సాగర్, సురేంద్ర, గణేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రాంగణ ఎంపికలలో ప్రతిభ


ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మెన్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ నాగరాజారావు

కడప ఎడ్యుకేషన్: కడప నగరం ఉక్కాయపల్లెలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. క్యూస్ స్పైడర్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు రాజశేఖర్, వైవీఎస్.సుహారిక, నాగేశ్వరరెడ్డి, కిషోర్‌రెడ్డి, వరలక్ష్మి, చక్రధర్, ద్రాక్షాయణి, ధనలక్ష్మి, హరి ప్రతాప్ రెడ్డి ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగరాజరావు తెలిపారు. కళాశాల చైర్మెన్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ నాగరాజు వారిని అభినందించారు.

వైవీయూలో సమన్వయకర్తల నియామకం

వైవీయూ: యోగి వేమన విశ్వ విద్యాలయంలోని పలు విభాగాల అధిపతులు, సమన్వయకర్తలను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2026 డిసెంబరు, 4వతేదీ వరకు వారు విధుల్లో కొనసాగుతారని పేర్కొన్నారు. డాక్టర్ టి.లక్ష్మీ ప్రసాద్(ఎర్త్ సైన్స్), డాక్టర్ వి.రామకృష్ణ (బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మాటిక్స్), డాక్టర్ టి.చంద్రశేఖర్ (పర్యావరణ శాస్త్రం), డా.ఎ.మునికుమారి, (జెనెటిక్స్ అండ్ జెనోమిక్స్), డా.ఎం.సుభాష్ చంద్ర (మైక్రో బయాలజీ), డాక్టర్ వి.లాజర్ (మనస్తత్వ శాస్త్రం), డా.ప్రమీల మార్గరెట్ (పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్), ఆచార్య ఎం.ఎం.వినోదిని (తెలుగు), ఆచార్య బి.శ్రీనివాసులు (ఆర్థిక శాస్త్రం), డాక్టర్ ఎస్.పి.వెంకటరమణ (జంతుశాస్త్రం), డా.వి.సునీత (భూగర్భ శాస్త్రం), డా.పి.సరిత (బిజినెస్ మేనేజ్మెంట్), డాక్టర్ కె.మృత్యుంజయరావు (ఫైన్ ఆర్ట్స్), డా.టి.శ్యామ్ స్వరూప్, (జర్నలిజం అండ్ కమ్యూనికేషన్), డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి (ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్) నియమితులయ్యారు.

రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వినతి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని రామాలయం చౌటపల్లెలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శాంతమ్మ, తహసీల్దారు ఎంవీఎస్. నారాయణరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 12 వినతి పత్రాలు స్వీకరించామని, వాటిలో పది మంది మిగులు భూములు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని కోరారన్నారు. మిగిలిన రెండు అర్జీలు గతంలో అక్రమంగా ఆన్‌లైన్ చేసి ప్లాట్లు వేశారని, ఈ విషయంగా తగిన న్యాయం చేయాలని కోరారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కె.శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కడప కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీ మోహన్ సూచించారు. స్థానిక ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈ ముఖ్య పాత్రతోపాటు ఎంఎస్ఎంఈ క్లస్టర్‌లో వివిధ పథకాల గురించి వివరించారు. జాలా అధ్యక్షుడు, చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సమావేశంలో 200 మంది పారిశ్రామిక వేత్తలు, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఖాతాదారుల రుణ ఆమోద పత్రాలను బ్యాంకు అధికారులు అందజేశారు.


మాట్లాడుతున్న ఆర్ఎం మురళీమోహన్

సురేష్‌రెడ్డికి పదవి దక్కడం అభినందనీయం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్సార్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్‌గా సురేష్‌రెడ్డిని నియమించడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సురేష్‌రెడ్డిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శశిభూషన్‌రెడ్డి మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా బీజేపీ అభ్యున్నతికి కృషి చేస్తున్న సురేష్‌రెడ్డిని పదవితో గౌరవించడం ప్రశంసనీయమన్నారు. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ కడపజిల్లాతో తనకు అనుబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శులు జంగం వెంకటసుబ్బారెడ్డి, హరిప్రసాద్, చలపతి, అమర్‌నాథరెడ్డి, బొమ్మన సుబ్బరాయుడు పాల్గొన్నారు.


సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నేతలు

వారసత్వ సంపదను కాపాడండి

కడప కల్చరల్: పూర్వీకులు ఎంతో శ్రమంతో దేవాలయాలను తీర్చిదిద్దారని, అవగాహనా లోపంతో వాటిని పాడు చేయవద్దని చారిత్రక పరిశోధకుడు చదలవాడ వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల పరిశోధనలలో భాగంగా ప్రాచీన దేవాలయాలను సందర్శించానని తెలిపారు. శిల్పాలకు దట్టంగా సున్నం కొట్టడంతో పాడైపోతున్నాయని తెలిపారు. సున్నంలోని కెమికల్స్‌తో రాతి శిల్పాలు అరిగి అసలు రూపాన్ని కోల్పోతాయన్నారు. అపురూపమైన సంపదను మనమే నాశనం చేసుకోవడం మంచిది కాదన్నారు.

నగరపాలక పాఠశాలలో ఆర్జేడీ ఆకస్మిక తనిఖీ

కడప ఎడ్యుకేషన్: కడప వర్కర్స్ కాలనీలోని నగర పాలక ప్రాథమిక పాఠశాలను పాఠశాల విద్య ఆర్‌జేడీ కె.శామ్యూల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డును 7న జరిగే మెగా పేరెంట్స్ కమిటీ కార్యక్రమంలో అందజేయాలన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవడం తోపాటు, పచ్చదనం పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఇవ్వాలని, రాగి జావ, చిక్కి, గుడ్డు అందే విధంగా చూడాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల వివరాలు చూస్తున్న ఆర్‌జేడీ శామ్యూల్

ఏపీజీబీ బ్యాంకు తరలింపు అన్యాయం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం తరలించి రాయలసీమ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ లెక్కల జోగిరామిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద బ్యాంకును తరలించడాన్ని నిరసిస్తూ శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని, కొత్త పరిశ్రమలు, ఆఫీసులు తీసుకురాకుండా, ఉన్న వాటిని తరలించడం సమంజసం కాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏపీజీబీ మెరుగైన సేవలదిస్తోందని, జిల్లా ప్రజా ప్రతినిధులంతా క్షేత్ర స్థాయిలో వాస్తవాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఆర్థిక శాఖ మార్గదర్శకాల్లో ప్రాధాన్యత రీత్యా ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించడం సరైన నిర్ణయం అన్నారు. విలీనం తర్వాత ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన ప్రయత్నం వెంటనే ఆపకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, కామనూరు శ్రీనివాసులురెడ్డి, దస్తగిరి రెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, రాజామణి, శివకుమార్, వీరపోగు రవి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కడప ఐటీఐ సర్కిల్ వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

ఆటో కార్మికులకు పావలా వడ్డీకే రుణాలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రతి ఆటో కార్మికుడికి పావలా వడ్డీకే రుణాలివ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి అన్నారు. నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా సమితి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీవో 21, 31 రద్దు చేస్తామని, డ్రైవర్లకు రూ. 5 నుంచి రూ.10 లక్షల రూపాయలు చంద్రన్న బీమా పాలసీ అమలు చేస్తామని, డీజలు పెట్రోల్ ధరలు తగ్గిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. వంద రోజులు గడిచినా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదన్నారు. అత్యంత ప్రమాదంగా ఉన్న రోడ్లను బాగు చేసేందుకు ఆర్అండ్‌బీ, గ్రామీణ, పట్టణ ప్రాంత టోల్ గేట్లు పెట్టే ప్రతిపాదన ప్రభుత్వం చేస్తోందన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆటో నడిపే వారిపై మరింత భారం పెరుగుతుందన్నారు. ఇప్పటి వరకు ఉన్న ఈ చలానా రద్దు వెంటనే చేయాలని, ఆటో డ్రైవర్లకు పావలా వడ్డీకే రుణాలివ్వాలని కోరారు. ప్రతి ఆటో కార్మికుడికి తమ స్వగ్రామంలోనే ఇంటి స్థలం మంజూరు చేసి ఇల్లు కట్టివ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు మద్దిలేటి, హరి, పుల్లయ్య, నాగిరెడ్డి, నారాయణస్వామి, పీరయ్య, రవి, చంద్ర, శివరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

దేశానికి వెలుగులిచ్చిన దార్శనికుడు

వైవీయూ: దేశ ప్రజలందరికీ వెలుగులిచ్చిన అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు అని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూలోని అన్నమయ్య సెనేట్ హాల్‌లో అంబేడ్కర్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడని గుర్తు చేశారు. అనంతరం అంబేడ్కర్ జీవితాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ ముళ్లబాటలో నడిచి దేశ ప్రజలంతా పూలబాటలో నడిచేలా రాజ్యాంగం అందించారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పుస్తకాలు చదివే అలవాటు పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య ఎ.జి.దాము, డాక్టర్ మమత, ఆచార్య కేఎస్‌వీ.కృష్ణారావు, డాక్టర్ అనుప్రసన్న, డాక్టర్ డీఆర్.సతీష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వైవీయూలో నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్, అధ్యాపకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. బండి జకరయ్య, అఫ్జల్ ఖాన్, అలీఖాన్, అబ్దుల్ సత్తార్, విజయ్ కుమార్, సయ్యద్ సలావుద్దీన్, కుళ్లాయప్ప, కదిరి ప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీపీ ఆధ్వర్యంలో: అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలంతా సమాన హక్కులు పొందగలుగుతున్నారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. కడప కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మడగలం ప్రసాద్, లక్ష్మీదేవి, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటేష్, విజయ్, తులసీరామ్ పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో: సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎన్.వెంకటశివ, మల్లికార్జున, మద్దిలేటి కె.మునెయ్య జి.నాగేశ్వరరావు, సావంత్, సుధాకర్ పాల్గొన్నారు.

కుల రహిత సమాజం కోసం కృషి

కడప కార్పొరేషన్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ కుల రహిత సమాజం కోసం నిరంతరం పోరాడారని ఏపీ ట్రాన్స్ కో చీఫ్ ఇంజినీర్ క్రిష్ణమనాయుడు అన్నారు. శంకరాపురంలోని ట్రాన్స్‌కో నిలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్‌ఈలు కేసీ బాషా, ఎస్.విశ్వేశ్వర్‌రెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, ఈఈలు నారాయణస్వామి, సతీష్, చంద్రశేఖర్, రామిరెడ్డి, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీకే.వీరభద్రయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయం

ఏఎఫ్‌యూ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ అన్నారు. డా.వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో శుక్రవారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ అంబేడ్కర్ తన జీవితాన్ని పేదల సంక్షేమానికి అంకితం చేశారన్నారు. ఎన్. రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

కడప సెవెన్‌రోడ్స్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని ఏపీ దళిత మిత్ర సంఘం అధ్యక్షుడు కె.రామాంజనేయులు, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం. ఓబులేసుయాదవ్, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున అన్నారు. అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జేసీఐపీ కార్యకర్తలు తమ పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, సుబ్బరాయుడు, దేవర శ్రీకృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు, సంగటి మనోహర్, వైఎం ప్రతాప్‌రెడ్డి, జేవీ రమణ, అమీన్‌పీరా, పి.మల్లికార్జున, తదవితరులు పాల్గొన్నారు.

రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో..

ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీస్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు దాసరి సుధాకర్ స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రజలకు అందించిన రిజర్వేషన్లు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం, మురళి, బాలఓబుయ్య, నారాయణ యాదవ్, కిరణ్‌కుమార్, ఓబులేసు, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.